విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 14 సెప్టెంబరు 2025 8 పేజీలు

- నిర్మాణానికి ఎదురైన అవంతరాలు తొలుగుతాయా!
- అధికారుల ప్రయత్నాలు ఫలించేనా?

132/33 కేవీ ఉప కేంద్రం
ప్రారంభం ఎప్పుడు?

విశాలాంధ్ర- లింగపాలెం: ధర్మాజీగూడెంలో చేపట్టిన132/33 కేవి విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణపు పనులకు ప్రారంభం నుంచి అంతరాయం కలుగుతూనే ఉంది.దీని నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని అధికారులు ఇప్పటికీ అనేకసార్లు వెల్లడించిన ప్రారంభం మాత్రం జాప్యం అవుతూనే ఉంది. దాదాపు రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ఉపకేంద్ర నిర్మాణపు పనులకు ఏదో ఒక అంతరాయం కలుగుతూనే ఉంది. నిర్మాణపు ప్రారంభంలో కాంట్రాక్టర్ మధ్యలో పనులను నిలిపివేసి వెళ్లిపోవడం, ఆ తరువాత తిరిగి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కొత్తగా నిర్మిస్తున్న ఉప కేంద్రానికి కే.కోట నుంచి కొత్తలైను వేస్తున్నారు. 28 కిలోమీటర్ల మేర దీని దూరం ఉంది. కొత్తలైన్ కోసం 102 స్తంభాలను నిర్మించాల్సి ఉండగా దాదాపుగా వీటి నిర్మాణం పూర్తి కావచ్చింది. కండక్టర్ లాగే విషయంలో కొత్త సమస్య తలెత్తింది. ఉప కేంద్రానికి వేసే కొత్త లైన్‌లో ఫామాయిల్, కొబ్బరి తోటలు అధికంగా ఉన్నాయి. వీటిని తొలగించి స్తంభాలు వేసినప్పటికీ కండక్టర్ లాగేందుకు రైతులు అంగీకరించటం లేదు. స్తంభాలువేసి, పైన కండక్టర్ లాగిన ప్రాంతంలో తిరిగి చెట్లు పెంచేందుకు అవకాశం ఉండదు. దీనివల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. రైతులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు పరిహారం ఇస్తామని ట్రాన్స్కో అధికారులు తెలిపారు. ఒక చెట్టుకు రూ.6లు ఇస్తామని అంటుంటే రైతులు చెట్టుకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్‌కు అధికారుల నుంచి సానుకూలత రావడం లేదు. దీంతో అనేకమంది రైతులు తమ స్థలంలో నుంచి స్తంభాలు వేయటానికి కండక్టర్ లాగటానికి వీలు లేదంటూ అడ్డు చెప్పుతున్నారు.

రైతుల ఆరోపణ: స్తంభాలు, కండక్టర్ వేసుకోవటానికి అనుమతిస్తే చెట్టుకు రూ 70వేలు ఇస్తామని కాంట్రాక్టర్‌కు చెందిన ఒక వ్యక్తి తమకు ఆశ చూపాడని స్తంభాలు వేశాక ఇతని అడ్రస్‌లేదని ఇచ్చిన ఫోన్‌నెంబరు పనిచేయటం లేదని రైతులు వాపోతున్నారు. ఫామాయిల్ చెట్టు 30 ఏళ్లు ఆదాయాన్ని ఇస్తుందని ఒక చెట్టుకు 30 ఏళ్లల్లో దాదాపు రూ.90వేలు ఆదాయం వస్తుందని, కొబ్బరికి రూ. 30వేలు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. విద్యుత్తులైన్ వేయటం వల్ల జీవితాంతం ▶మిగతా 2లో..

స్త్రీల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: స్త్రీల ఆరోగ్య పరిరక్షణకు జిల్లాలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టర్ తన చాంబర్లో స్వస్థ నారి శసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వస్థ నారి శసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్త్రీల ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, పరీక్షలు, చికిత్సలు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈ నెల ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుపరచుటకు చర్యలు తీసుకోవాలని డి ఎం అండ్ హెచ్ ఓను ఆదేశించారు. సామాజిక, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు, జిలా, వైద్య కళాశాల ఆసుపత్రులు అధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులు సహకారంతో మహిళలు మరియు పిల్లల కేంద్రీకృత ఆరోగ్య శిబిరాలు నిర్వహణ, స్క్రీనింగ్, అవహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. క్యాన్సర్ స్క్రీనింగ్, ప్రసూతి సంరక్షణ, తల్లి, పిల్లల రక్షణ, ఇమ్యునైజేషన్, రక్తహీనత స్క్రీనింగ్ రక్తదానం, ▶మిగతా 2లో..

పెరిగిన వరద నిలిచిన రాకపోకలు

విశాలాంధ్ర -కుక్కునూరు: కుక్కునూరు-దాచవరం గ్రామాల మధ్య ఉన్న గుండేటివాగు వంతెన మళ్లీ మునిగింది. గోదావరి వాగుకి పోటెత్తడంతో వంతెనపైకి భారీగా వరద చేరింది. శనివారం మధ్యాహ్నం నుంచి ఆ మార్గం గుండా రాకపోకలు నిలిచాయి. శనివారం ఉదయం వంతెనపై వాహనాలు, పాదచారుల రాకపోకలు కొనసాగాయి. అనూహ్యంగా మధ్యాహ్నం అటు వర్షాలు ఇటు గోదావరి వరద ధాటికి వంతెన నీటమునిగింది. దీంతో 10 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. బెస్తగూడెం, దాచవరం, రామచంద్రాపురం, గొమ్ముగూడెం, రామన్నగూడెం, ఊటబోరు, నెమలిపేట తదితర గ్రామాలకు కుక్కునూరు మండలం కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. మండలంలో ఉన్న బ్యాంకులు, ప్రభుత్వ కార్యాల యాలకు పలు పనుల కోసం ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పనుల అనంతరం వేరే మార్గం గుండా తిరిగివెళ్లారు.కాగా నాలుగు రోజుల క్రితం వంతెన వరద నుంచి బయటపడింది.

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలో పలుచోట్ల శనివారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా మూడు గంటలసేపు కురిసిన వర్షంతో వరద ఏరులై పారింది. ఎగువ ప్రాంతంలో వర్షం భారీగా పడటం వలన వాగులు ప్రవాహం మరింత పెరిగింది. గోదావరి వరద పెరగడం మళ్ళీ మొదలైంది. వర్షాకాలం మొదలైనప్పటి నుంచి ఎద్దువాగు పోటెత్తడంతో రహదారులు ▶మిగతా 2లో..

సమస్యల పరిష్కారంలో
స్పష్టమైన వైఖరి అవసరం

- ముందస్తు ప్రణాళికలు, సమస్యల పరిష్కారమే లక్ష్యం
- కార్యక్రమాల అమలులో నిబద్ధత, పారదర్శకత
- నమ్మకంతో కూడిన పరిపాలన
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలిసి కట్టుగా జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం
- వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష

కీర్తి బాధ్యతల స్వీకరణ

శనివారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా కీర్తి చేకూరి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనాలు అందచేసి, అనంతరం శాలువాతో సత్కరించి ప్రసాదం అందచేశారు.

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి కీర్తి చేకూరి శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్‌లో జిల్లా అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా పరిపాలనలో తీసుకోబోయే దిశ, రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చర్చించాల్సిన అనేక అంశాలపై స్పష్టమైన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అర్థం చేసుకోవడంలో అధికారుల నుంచి స్పష్టమైన వైఖరి అవసరమని సూచించారు. ప్రతిశాఖలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, దరఖాస్తులు, కేసులను సమగ్రంగా పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్యలను సగటు దృష్టితో కాకుండా, మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణకి చెందిన అంశాల గురించి సంబంధిత అధికారులు పౌర సేవలు అందించే క్రమంలో మెరుగైన పనితీరు చూపాలని పేర్కొన్నారుముందస్తు ఆలోచన - శీఘ్ర పరిష్కారమే లక్ష్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, క్షేత్ర స్థాయిలో సమస్యలు మూడో వ్యక్తి ద్వారా తన వద్దకు రాకుండా ముందుగా మీరే గుర్తించి వాటికి తగిన పరిష్కార సూచనలతో రావాలన్నారు. సమస్యలు తలెత్తిన తరువాత చర్యలు తీసుకోవడం కాకుండా, ముందుగానే సమస్యల నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలం, వరదలు, తాగునీటి సమస్యలు, రహదారి మరమ్మతులు వంటి అంశాలను ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలు తీర్చడం, వారికి కావాల్సిన ▶మిగతా 2లో..

ప్రారంభం ఎప్పుడు? (1వ పేజీ తరువాయి)

ఆదాయం ఉండదని రైతులు అంటున్నారు. తమకు వచ్చే ఆదాయాన్ని వదులుకొని అందరికీ విద్యుత్తు ఉండాలని దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని గ్రహించి భూములను ఇవ్వటానికి అంగీకరిస్తే కనీసపు నష్టపరిహారం ఇవ్వకపోతే ఎలా? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. న్యాయంగా పరిహారం ఇవ్వాలని తాము కోరుతుంటే పోలీసులను పెట్టి లైన్ లాగేస్తామని బెదిరిస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. విద్యుత్తు లైను లాగటం వల్ల ఎకరం, రెండెకరాలు ఉన్న రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని భూమి ఉన్న నిరుపయోగంగా వదిలేసుకోవలసిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కొందరు భూములలో 80 చెట్లు, 40 చెట్లు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వెల్లడించారు. తొలగించిన చెట్ల స్థానంలో తిరిగి ఏ పంట పండించడానికి వీలుండదని రైతుల అంటున్నారు. తాము నష్టపరిహారం అధికంగా అడగలేదని కేవలం రూ.20వేలు మాత్రమే కోరుతున్నామని తెలిపారు. రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కనీసం నోటి మాట చెప్పకుండా రాత్రి సమయాలలో చెట్లు నరికి స్తంభాలు వేశారని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్తు లైను వేయటానికి రైతులు వ్యతిరేకం కాదని దీనివల్ల తమకే ఉపయోగమని, తాము కోరుకున్న పరిహారాన్ని చెల్లించకపోతే న్యాయస్థానానికి వెళ్తామని మోరంపూడి సుబ్రహ్మణ్యం అనే రైతు తెలిపాడు. బెదిరిస్తే భూములను వదిలేసుకోవాలా? అని ఆయన ప్రశ్నిస్తున్నాడు.

ఉపకేంద్రం ప్రారంభానికి చర్యలు: ఉపకేంద్ర నిర్మాణపు పనులు ఈనెలాఖరుకు పూర్తి చేసి అక్టోబరులో ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా రైతులను సమన్వయం చేసేందుకు ఉపకేంద్ర నిర్మాణపు ఏడిఏ రంజిత్ కుమార్ చర్యలు తీసుకున్నారు. ఈపీడీసీఎల్ అధికారుల సహకారాన్ని తీసుకుంటున్నారు. ప్రధానంగా డిఈ అంబేద్కర్ రైతులను సమన్వయం చేయుటలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. చాలామంది రైతులను ఈయన సమన్వయం చేయటంతో పనులు వేగంగానే జరిగాయి. కొద్దిమంది రైతులు మాత్రం ముందుకు రావటంలేదు. వీరిని ఒప్పించేందుకు డిఈ ట్రాన్స్‌కో ఏడిఏ రంజిత్ కుమార్ ఎల్ఐ పాలడుగు వెంకటరమణలను బృందంగా నియమించి రైతులను సమన్వయం చేసే కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికీ 17 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మరో 11 కిలోమీటర్ల మేర పనులు చేయాల్సి ఉంది. దీనితోపాటు ఉపకేంద్రంలో 50ఎం.వి ట్రాన్స్ ఫార్మర్ అమర్చాల్సి. ఈపనులు పూర్తయితే ఉప కేంద్రాన్ని ప్రారంభించవచ్చు. 132/33 కేవి ఉపకేంద్రం ప్రారంభిస్తే నాణ్యమైన విద్యుత్తు సరఫరా అవుతుందనే ఆశతో వినియోగదారులు ఎదురుచూస్తున్నారు.

అవగాహన (1వ పేజీ తరువాయి)

టి.బి స్క్రీనింగ్, అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఆనారోగ్య మహిళలకు క్షయవ్యాధి స్క్రీనింగ్, కౌమారదశలో ఉన్న బాలికలు, మహిళలకు రక్తహీనత స్క్రీనింగ్, కౌన్సెలింగ్ సేవలు, పిల్లలకు రోగనిరోధక సేవలు అందించబడతాయన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ సాంఘిక సంక్షేమ శాఖ, డిఆర్డిఏ, విద్యాశాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పిహెచ్‌సి కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ హెల్త్ క్యాంపులకు వచ్చే మహిళలను ఆదరణగా రిసీవ్ చేసుకోవాలని వారికి మంచి పోషకాహారం, అల్పాహారం అందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి, డి సి హెచ్ ఎస్ పి.సూర్యనారాయణ, డి ఆర్ డి ఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ఐసిడిఎస్ పిడి డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుశాఖ చర్యలు భేష్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకునే చర్యలు అభినందనీయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య చెప్పారు. ఏలూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు వినియోగించుకునేందుకు గుప్తా ఫౌండేషన్ యాజమాన్యం అందజేసిన నూతన బొలారో వాహనాన్ని శనివారం ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ కి అందజేశారు. ముందుగా వాహనాన్ని ఎమ్మెల్యే చంటి, ఎస్పీ కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అహర్నిశలు సేవలు అందిస్తూ, ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా పని చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశ్యాన్ని అవలంబిస్తూ ప్రజల సహకారంతో పోలీసు వ్యవస్థకు అవసరమైన వాహన ఇతర సదుపాయాలను అందజేయడం ఎంతో అవసరమన్నారు. ఇందులో భాగంగానే గుప్తా ఫౌండేషన్ ఈ బాధ్యతను స్వీకరించి నూతన వాహనాన్ని కొనుగోలు చేసి పోలీసు శాఖకు అందజేయడం స్ఫూర్తిదాయకమన్నారు. రాబోయే కాలంలో ప్రజల సహకారంతో పోలీస్ విభాగానికి అవసరమైన సదుపాయాలను అందించడంలో తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఈ బొలారా వాహనం ద్వారా ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి వీలు కలుగుతుందన్నారు. గతం నుంచి డ్రోన్ ఆధారిత ట్రాఫిక్ మానిటరింగ్ ద్వారా రోడ్డు ఆక్రమణలను నియంత్రిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగే అవకాశం లేకుండా నియంత్రణకు కీలక పాత్ర పోషించి ఎమ్మెల్యే చంటి సహకారంతో రోడ్డు ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. అదేవిధంగా ఏలూరు నగర వ్యాప్తంగా సీసీటీవీలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం లో నగరాన్ని ముందంజలో నిలబెట్టడానికి సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు, ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు, ఆర్ఐ పవన్ కుమార్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ కృషి అభినందనీయం : రైతులు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : పొగాకు అదనపు కొనుగోళ్లకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో చేసిన కృషి అభినందనీయమని పలువురు పొగాకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ కృషి వల్లే జిల్లాలో పొగాకు, పామాయిల్ రైతులు నష్టపోకుండా న్యాయం జరుగుతుందని ఆనందం పడ్డారు. శనివారం స్థానిక శాంతినగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ మహేష్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పొగాకు, పామాయిల్ పండించే రైతులు ఎంపీ కార్యాలయానికి భారీగా తరలివచ్చి ఎంపీని శాలువాలు, పూలమాలలతో సత్కరిం చారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో పొగాకు, పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. రైతుల ఇబ్బందులపై పలు మార్లు తాను పార్లమెంట్‌లో మాట్లాడటంతో పాటు, కేంద్ర వాణిజ్య, వ్యవసాయ మంత్రులను కలిసి సమస్యలను వివరించిన మీదట, స్వల్ప పెనాల్టీతో కేంద్రం రైతులు అదనంగా పండించిన పొగాకును కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకరించిందన్నారు. ఆయిల్ పామ్‌కు సరైన ధర లభించేట్లు ఒత్తిడి తీసుకురాగలిగామని, తాజాగా పామాయిల్ గెలలకు మంచి ధర లభిస్తోందన్నారు. జిల్లాలోని జంగారెడ్డిగూడెం- ఏలూరు రహదారి పనులు నిలిచి పోవడంపై సంబంధిత కాంట్రాక్టరు, ఆర్ అండ్‌బీ అధికారులను ఎంపీ ఆరా తీశారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో రోడ్డు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కలుపుతూ ఏలూరు జిల్లా మీదుగా ఖమ్మం - కొవ్వూరు జాతీయ రహదారిపై జంగారెడ్డిగూ డెం నుంచి ద్వారకాతిరుమల - ఏలూరు - కైకలూరు - కత్తిపూడి మీదుగా నూతన జాతీయ రహదారిని ప్రతిపాదిస్తున్నట్లు ఎంపీ వెల్లడించారు. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త రహదారి కోసం త్వరలో ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపుతామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు.

స్పష్టమైన వైఖరి అవసరం

1వ పేజీ తరువాయి)

సమయానికి అందించడం పరిపాలన లక్ష్యంగా కావాలని ఆమె స్పష్టంచేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై నిబద్ధత మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, పేదల సంక్షేమ కార్యక్రమాలు జిల్లా స్థాయిలో సమర్ధవంతంగా అమలవ్వాలని పేర్కొన్నారు. ఈ పథకాల లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా, నిబద్ధతతో, సమయ పాలనతో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రతి అధికారి విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించి ప్రజల్లో పరిపాలనా పరంగా నమ్మకం పెంచాలని ఆమె స్పష్టం చేశారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ -ప్రజా నమ్మకమే పరమావధిగా పనిచేయాలన్నారు. అన్ని స్థాయిల్లో పరిపాలనలో బాధ్యతాయుత ధోరణి కనబరచాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలకు నిజసమయంలో చేరేలా అధికారులు పర్యవేక్షించాలి. 'ప్రజలు ప్రభుత్వంపై ఉంచే నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మనందరి బాధ్యత' అని కలెక్టర్ స్పష్టంచేశారు. పిజిఆర్ఎస్ కు సంబంధించి కలెక్టరేట్ కు రావడం జరుగుతోందని, వాస్తవంగా డివిజన్ మండల పరిధిలో వాటికి సంబంధించిన పరిష్కారం లభిస్తున్న అధికారులు సరైన విధంగా చర్యలు తీసుకోవడంలో లోపం, ప్రజల సమస్య పూర్తి వివరాలు తెలుసుకోవడంలో చొరవ చూపక పోవడం ప్రధాన కారణం అన్నారు. మనందరం కలిసి కట్టుగా తూర్పు గోదావరి టీం లా పని చేసి జిల్లాను అగ్ర గామిగా నిలపడం లో సమన్వయం పరస్పర సహకారంతో కలిసి పని చేద్దాం అని కలెక్టర్ చెప్పారు. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంలో జిల్లాకు చెందిన ముఖ్యమైన సమస్యలు, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రావలసిన అనుమతులు, నిధులు మంజూరు తదితర అంశాలపై శాఖల వారిగా చర్చించడం జరిగింది. ఈమేరకు సమగ్ర నివేదిక అందచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి, ఆర్డీవో లు ఆర్ కృష్ణ నాయక్, రాణి సుస్మిత, కెఆర్సీసీ ఎస్డీసీ కే భాస్కర్ రెడ్డి, సీపీవో ఎల్ అప్పల కొండ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవ రావు, జిల్లా ఉద్యానవన అధికారి ఎన్ . మల్లికార్జున రావు, ఏపీ ఎంఐపీ పిడి ఏ దుర్గేష్, జిల్లా పశు సంవర్ధక అధికారి టి. శ్రీనివాస రావు, పిడి డిఆర్డీఏ ఎన్ వి వి ఎస్ మూర్తి, జిల్లా మత్స్య అధికారి టి. నిర్మలా కుమారి, డిఎమ్ హేచ్ వో కె. వెంకటేశ్వర రావు, తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణ టీకాలు సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణ ఉచిత టీకా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకాలు కార్యక్రమం అవగాహన గోడ పత్రికను శనివారం కలెక్టరేట్ ఛాంబర్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 15 నుంచి అక్టోబర్ 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉచితముగా టీకాలు వేయు కార్యక్రమం జిల్లాలోని పశువుల యజమాను లందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది ప్రతి గ్రామంలోను నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ఉచిత టీకాలను వేయడం జరుగు తుందన్నారు. పశువుల యజమానులు ఆవు జాతి మరియు గేదె జాతి పశువులకు ఉచిత టీకాలను వేయించి గాలికుంటు వ్యాధి రాకుండా తమ పశువులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మమురలీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు మంగపతి రావు, సిపివో కె.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నిలిచిన రాకపోకలు

1వ పేజీ తరువాయి)

ముంపుకు గురైయి సుమారు 15 గ్రామాలకు ప్రతి నెలలో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటి కూడా ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. మళ్ళీ కురుస్తున్న వర్షాల వలన వారికి ఇబ్బందులు తప్పేలా లేవు. గోదావరి ముంపు ప్రభావం ఉన్న భూముల్లో ఇంకా వ్యవసాయం ప్రారంభం కాలేదు. తుఫాను, వరదల ప్రభావం వలన వందల ఎకరాల భూమిలో పంటల సాగు ప్రశ్నార్ధకంగా మారింది. దీంతో కూలీలు ఉపాధి కోల్పోతున్నారు.

ఎం బుక్ పోయింది

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ **దారుడు రెడ్డి హేమచంద్**కు సంబంధించి ఎం బుక్ పోయింది. ఆ బుక్ నెంబర్ **584/B/MGNREGS/ELR/2017-18** సంబంధించిన బుక్ పోయిందని భీమడోలు పంచాయితీ రాజ్ డిఈఈ **ఉద్దగిరి నాగ ఆంజనేయ వేణుగోపాల్** చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఎం బుక్ కైకరం గ్రామపంచాయతీకి ఇవ్వడం జరిగింది, మా వద్ద లేదని తెలియజేశారు. ఎవరికైనా దొరికితే ఈ కింద అడ్రసుకు పంపగలరని కోరుతున్నాం.

ఉద్దగిరి నాగ ఆంజనేయ వేణుగోపాల్ పంచాయతీ రాజ్ డిఈఈ, భీమడోలు భీమడోలు మండలం

5 కోట్ల మందికి ఎన్‌టీఆర్ వైద్యసేవలు : మంత్రి

విశాలాంధ్ర-నూజివీడు : పేదలకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం వేల కోట్లు కేటాయించిందని, రాష్ట్రంలో 5 కోట్ల ప్రజలకు ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా ఆరోగ్య సేవలు కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఆపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో చాట్రాయి మండలంలో 17 కుటుంబాలకు రూ.6.99లక్షలు, ఆగిరిపల్లి మండలంలో 6 కుటుంబాలకు రూ.1.95 లక్షలు, ముసునూరు మండలంలో 7 కుటుంబాలకు రూ.3.15లక్షలు, నూజివీడు మండలంలో 6 కుటుంబాలకు రూ.3.97లక్షలు, నూజివీడు పట్టణానికి చెందిన 8మంది కుటుంబాలకు రూ.5.28లక్షలు ఇతర ప్రాంతాలకు చెందిన 8మంది రూ.3.14లక్షలు మొత్తం 52మంది కుటుంబాలకు రూ.24.49లక్షలు చెక్కులను బాధిత కుటుంబాలకు మంత్రి అందజేశారు.

ఆటో డ్రైవర్లకు రూ.15వేలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దసరా కానుకగా ఈ నెలలో ఆటో డ్రైవర్లకు రూ.15వేలు నగదును వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని, టిడిపి ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. శనివారం ఆమె నివాసం వద్ద ఆటో యూనియన్ డ్రైవర్లు వారి వాహనాలను తీసుకువచ్చి ఆమెకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని గురించి, తెలియజేస్తూ ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి వారి ఖాతాలలో నగదు జమ చేస్తామని చెప్పడం హర్షించదగ్గ విషయమని మేఘలాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అన్ని విధాల అండగా ఉం టుందని మేఘాల దేవి భరోసా ఇచ్చారు. ఈ కార్య క్రమంలో ఆటో యూనియన్ డ్రైవర్లందరూ పాల్గొన్నారు.

ఘనంగా మెంటే పుట్టినరోజు

విశాలాంధ్ర -భీమవరం: టీడీపీ రాష్ట్ర కోశాధికారి, సీనియర్ నేత మెంటే పార్థసారధి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని మాజీ రాజ్యసభ సభ్యులు తోట సీతారామలక్ష్మీ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీ మహిళ ఆర్థిక సహకార కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య భీమవరంలో కేక్ కట్ చేశారు. కృష్ణ బలిజ పూసల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు పార్థసారధికి శాలువా కప్పి, గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు వేండ్ర శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, కుటమి నాయకులు పొత్తూరి బాపిరాజు, మెరగాని నారాయణమ్మ, ఇందు కూరి సుబ్రహ్మణ్యరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షులు మద్దుల రాము, ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, జాయింట్ సెక్రెటరీ యలమంచిలి శ్రీని వాసరావ్, కార్యకర్తలు, అభిమానులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : డీఎస్పీ

విశాలాంధ్ర. జంగారెడ్డిగూడెం : నిరంతరం పని ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరమని జంగారెడ్డిగూడెం డిఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు గుండె వైద్యపరీక్షల శిబిరం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం వద్ద డాక్టర్ వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం ఏపీయూడబ్ల్యూజె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ యు.రవిచంద్ర ప్రారంభించారు. జర్నలిస్టు, భార్య, తల్లి తండ్రులకు గుండె సంబంధ బీపీ, షుగర్, కన్సల్టేషన్, ఈసీజీ, 2డి ఏకో వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.వేణు జర్నలిస్టులకు వైద్య పరీక్షలు చేసి, సలహ సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజలకు డాక్టర్ వేణు హాస్పిటల్ వరం లాంటిదన్నారు. ఇప్పటి వరకూ గుండె సంబంధ వ్యాధులు వస్తె ఏలూరు, రాజమండ్రి, విజయవాడ వంటి నగరాలకు వెళ్లవలసి వచ్చేదని, ఈ లోపు గుండెపోటుతో మరణాలు సంభవించేవని అన్నారు. డాక్టర్ వేణు హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెకు స్టెంట్ వేయడం, బైపాస్ సర్జరీ చేయడం ఇక్కడే జరుగుతుందని అన్నారు. ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.వేణు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో మరిన్ని ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని, కార్డియాలజీతో పాటు త్వరలో న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటమాలజీ సేవలు ప్రవేశ పెడతామని అన్నారు. ఐ.జె.యు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఉచిత గుండె వైద్య సేవలు అందించేందుకు సహకరించిన డాక్టర్ వేణు, శిబిరం ప్రారంభించిన డీఎస్పీ రవిచంద్ర లకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో మారుమూల ప్రాంతమైన జంగారెడ్డిగూడెంలో గుండె వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, గుండెపోటు వచ్చినప్పుడు దూరప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా ఇక్కడే చికిత్స పొంది, ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, డాక్టర్ వేణు హాస్పిటల్ ప్రతినిధులు నరేంద్ర, రాజశేఖర్, ఏపీయూడబ్ల్యూజె నాయకులు డీవీ భాస్కరరావు, కేవీ రమణారావు, కె. వెంకట్, సీనియర్ జర్నలిస్టులు వి.శ్రీనివాస్, సురేష్, పి.సాయికుమార్, ఎన్.బాల సుబ్రహ్మణ్యం, సందూరి కిషోర్, చందు తదితరులు పాల్గొన్నారు.

19న జనరేటివ్ ఏఐపై వర్క్ షాప్

విశాలాంధ్ర -భీమవరం: రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జనరేటివ్ ఏఐ అనే అంశంపై అధ్యాపకులకు 19న ఒక రోజు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా సివిఎస్‌డి హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్అండ్ డిజైన్ (సివిఎస్‌డి), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సివిఎస్ఐటి) ఫ్యూచర్ ఓఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళి కృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్ గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న జనరేటివ్ ఏఐ రంగం గురించి అధ్యాపకులు అధ్యయనం చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జనరేటివ్ ఏఐ రంగంలో విశేష అనుభవం ఉన్న పరిశ్రమ రంగ నిపుణులు హాజరై వర్క్ షాప్‌లో నూతన టెక్నాలజీని అందించనున్నారని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించండి : కామయ్య

విశాలాంధ్ర ఏలూరు: సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలలో ఉద్యోగులుగా 35 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ అనంతరం తమకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. కామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కెనాల్‌రోడ్డులో యుటిఎఫ్, కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కె.కామయ్య మాట్లాడుతూ 2020 నుంచి ఇప్పటివరకు 550 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారని, వీరికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, అరియర్స్ నేటికీ చెల్లించే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 65 మంది విశ్రాంత ఉద్యోగులు తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందకుండానే చనిపోయారని పేర్కొన్నారు. 2014 నుండి మెడికల్ బిల్లులు నేటికీ చెల్లించలేదని విమర్శించారు. డీఏ బకాయిలు 2018 నుండి 2021 వరకు చెల్లించలేదని,ఎర్నలీవ్స్,ఫైనల్ సెటిల్మెంట్ 6 సంవత్సరములుగా చెల్లించలేదన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల రాష్ట్ర సంస్థ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మాత్రం తమకు రావలసిన బెనిఫిట్స్ పొందారని ఆరోపించారు. శాఖా పరంగా అందరికీ ఒకే విధమైన నిబంధన ఉంటుందని, గురుకుల విద్యాలయాల రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణం పొందుతుండగా, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు,కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి మాత్రం బెనిఫిట్స్,అరియర్స్ చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. నిధులు,బడ్జెట్ ఉన్నా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా మంజూరుకు నోచుకోలేదని తెలిపారు.వారి నిర్లక్ష్యం కారణంగా మంజూరైన బడ్జెట్‌ను వినియోగించుకోలేని స్థితిలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారని విమర్శించారు.ఒకవేళ నిధులు లేకపోతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆలోచన లేకపోవడం శోచనీయం అన్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ విరమణ అనంతరం బెనిఫిట్స్,అరియర్స్ చెల్లిస్తున్నారని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి రిటైర్ అయిన వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఉద్యమాల ద్వారా పోరాటానికి సిద్ధం అవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలోని అనేక గ్రామాలకు చెందిన మూడు కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాచ్వానగరంలోని అబ్బదాసరి జ్యోతికి రూ.51 వేలు, కె.గోకవరంలోని బి.వెంకటేశ్వరరావుకు రూ.20 వేలు, ఎం. చిట్టెమ్మకు రూ.25వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె. గోకవరం సర్పంచ్ యలమంచి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు మందలపు నాని, టీడీపీ నాయకులు ముప్ప బాబూరావు, ఎర్రగొర్ల ఉదయ్ కిరణ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు టి.మల్లయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర -భీమవరం: అక్షరాస్యులు, నిరక్షరాస్యులు సైబర్ నేరాల చిక్కుల్లో పడి మోసపోతున్నారని, వీటిపై జాగ్రత్తలు తప్పనిసరి అని భీమవరం ఆర్టీసీ ఇన్ ఛార్జ్ మేనేజర్ వై.సురేష్ అన్నారు. ఈగల్‌సెల్ ఆధ్వర్యంలో భీమవరం కొత్త బస్టాండ్లో సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ దొంగతనాలు అనేక విధాలుగా దోపిడీకి గురి చేస్తుంటే సైబర్ నేరగాళ్లు అందరిని మోసం చేస్తున్నారని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచిత వ్యక్తులకు ఇవ్వకూడదని, ఎటువంటి యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, ఓటీపీలు ఇవ్వద్దని అవగాహన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, కె.రత్నమాల, ఎన్.సుధారాణి, ఎస్.రాధిక, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఈ-పాస్ మిషన్ల పంపిణీ

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలంలో గత రెండు రోజులుగా పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ డీలర్లకు కొత్త ఈ-పాస్ మిషన్‌లను పంపిణీ చేస్తున్నారు. స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, ఉండి, ఆకివీడు, కాళ్ళ మండలాల్లోని డీలర్లకు పంపిణీ చేశారు. పదేళ్ల క్రితం ఇచ్చిన మిషన్‌లను ఇప్పటి వరకు డీలర్లు వాడుతున్నారు. ఈ సందర్భంగా డివిజన్ అసిస్టెంట్ పౌర సరఫరాలశాఖ అధికారి రవిశంకర్ మాట్లాడుతూ మారిన టెక్నాలజీకి అనుగుణంగా కొత్త ఈ-పాస్ మిషన్ లను పంపిణీ చేశామని, వీటి వల్ల కార్డుదారుడు ఎక్కువ సేపు వేచి ఉండనక్కర లేదన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ అధికారులు ఆదిశేషయ్య, సురేష్, సూర్యనారాయణ రాజు, విజన్ టెక్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, మణికంఠ, అనిల్,మోహన్, కళ్యాణ్, పవన్ లు రేషన్ డీలర్ల సంఘ నాయకులు మద్ది సుబ్బయ్య, దొంగ కృష్ణ, సాయి కృష్ణ కొల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ముందస్తు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - భీమడోలు : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు పాడిరైతులు తమ పశువులకు ముందస్తు టీకాలను వేయించాలని భీమడోలు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇక్కుర్తి సాయిరమేష్ తెలిపారు. శనివారం సాయంత్రం భీమడోలు పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఏడీ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15వ తేదీ సోమవారం నుంచి జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కింద పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. భీమడోలు పరిధిలో 28,184 గేదెలు, 6,914 ఆవులు ఉన్నాయని వీటన్నింటికీ ఉచితంగా వ్యాక్సినేషన్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో LSA జే.శ్రీహరికృష్ణ, డీఈవో పి.చలపతిరావు, ఓఎస్ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎమ్మెల్యే ధ్యేయం

విశాలాంధ్ర - చింతలపూడి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ పనిచేస్తున్నారని చింతలపూడి నగర పంచాయతీ అధ్యక్షులు తాటి అప్పారావు అన్నారు. చింతలపూడి పట్టణం పాత చింతలపూడి గ్రామంలో ఐదు సంవత్సరాలుగా పాత చింతలపూడి మెరక వీధి కాలనీకి చెందిన మంచినీటి సమస్యను పరిష్కరించడానికి స్థానిక శాసనసభ్యులు మంచినీటికి బోరు కావలసిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలనే అధికారులు ఆదేశించారని నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. ఆయన మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీలో బడ్జెట్ లేకపోయినప్పటికీ దాతల సహకారంతో వెంటనే అధికారులను అప్రమత్తం చేసి తాగునీటి బోరు వేయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎండాకాలంలో మంచినీటి ట్యాంకర్లతో నీళ్లు అందించి ప్రజల దాహార్తిని తీర్చిన వ్యక్తి స్థానిక శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, తాటి సింహ, రాజరత్నం పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : టి నరసాపురం ఎర్రచెరువు ప్రాంతంలో నివాసం వుంటున్న నిరుపేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు ఏలూరు క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి వినతిపత్రం అందజేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్ర చెరువు కాలనీలో నివాసం వుంటున్న పేదలకు 2014 నుంచి 2019 మధ్య టిడిపి ప్రభుత్వంలో మంజూరు అయి ఇళ్ల నిర్మాణాలు జరిగిన వారికి గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు నిలుపుదల చేసిందని ఆయన తెలిపారు. నేటికి పేదలు ఇంటి బిల్లులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకుని వెళ్లగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఏపీ రాష్ట్ర ఫిష్ ట్రేడర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఐస్ ఫ్యాక్టరీ యాజమాన్యులకు భరోసా ఇచ్చారు. ఏపీ రాష్ట్ర ఫిష్ ట్రేడర్స్ అండ్ ఫ్యాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐస్ ఫ్యాక్టరీల యజమానులు శనివారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ధర్మరాజును కలుసుకొని ఫిష్ ట్రేడర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిష్ ట్రేడర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, మార్కెట్లో హెచ్చుతగ్గులు గురించి వారు సమావేశంలో వివరించారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలుసుకొని మీ సమస్యను వారి వారి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

విశాలాంధ్ర- నూజివీడు : మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా సిఐటియు 13వ మహాసభలు శనివారం నూజివీడు పట్టణంలో ఆర్.సత్యనారాయణ రాజు నగర్లో ప్రారంభమయ్యాయి. తొలుత సిఐటియు పథకాన్ని సిఐటియు సీనియర్ నాయకులు హనుమాన్లు ఆవిష్కరించారు. ఆర్.లింగరాజు, ఆర్.వి.ఎస్ నారాయణ, పి.భారతి, కనకరావు, కమల అధ్యక్ష వర్గంగా ప్రారంభమైన సభలో సంతాప తీర్మానాన్ని జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రవేశపెట్టారు. ప్రారంభ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను, ఉద్యోగులని చిన్నచూపు చూస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక విషయాలు చెప్పింది. వేతనాలు పెంచుతామని చెప్పి మాట మార్చారని విమర్శించారు. విద్యా, వైద్యాన్ని పేద ప్రజలకు అందకుండా చేసేలా రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వమే కొనసాగించాలని, కార్మిక వర్గం ఐక్యతతోనే ప్రైవేటీకరణను అడ్డుకోగలమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జి.రాజు, మోడియం నాగమణి, యర్నం సాయికిరణ్, ప్రసాద్, ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, పోశమ్మ, నాయకులు రాజులపాటి చంటి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-చింతలపూడి : నూతనంగా ఎన్నికైన త్రిసభ్య కమిటీలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యులకు మెరుగైన సేవలు అందించాలని, చింతలపూడి నియోజకవర్గం ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి మండలంలో చింతలపూడి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంఉత్సవం ఆర్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ ఎమ్మెల్యే శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్ పదవి బాధ్యతతో కూడిన పదవి అనీ, సొసైటీ ఎంత మంది రైతులు ఉన్నారు, లాభాలలో ఉందా లేదా చూసి, రైతులతో రుణాలు కట్టించి మేలు చేయాలనీ అన్నారు. రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలనీ తెలిపారు. చింతలపూడి నియోజకవర్గం సొసైటీలకు శెట్టివారివారిగూడెం పెట్రోల్ బ్యాంకు ఏర్పాటు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ల్యాండ్ కూడా చూస్తున్నామని తెలిపారు. సీనియర్ నాయకులు సలహాలు సూచనలు తీసుకుని ముందు వెళ్లాలన్నారు. అదే విధంగా సొసైటీ లాభాలలో తీసుకోవాలని, కృషి చేయాలన్నారు. యూరియా కొరత చింతలపూడి నియోజకవర్గంలో లేదు. జిల్లా కలెక్టర్, గన్ని వీరంజనేయులు, అప్పటికప్పుడు యూరియా కొరత లేకుండా చూస్తున్నారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎక్కడా కూడా ఎరువుల కొరత లేదు విత్తనాలు, ఎరువులు, నీరు, మద్దతు ధర అన్నింటిని సమయానుకూలంగా రైతులకు అందేలా సీఎం చంద్రబాబు నాయుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. యూరియా రైతులకు అందుబాటులో ఉందని ఎక్కడా కూడా ఎరువుల కొరత లేదన్నారు. రైతుల సంక్షేమం గురించి ఎప్పుడూ పట్టించుకోని జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు దుష్ప్రచారం చేస్తూ రైతులను ఆందోళనకు గురి చేయాలని ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. రైతులు కూడా జగన్ అబద్ధాలను గమనిస్తున్నారని స్పష్టం చేశారు. చింతలపూడి నియోజకవర్గం రోడ్లుకు మొదట ప్రాధాన్యత కూటమి ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. రేచర్ల, బాధరాల, కొణిచర్ల రోడ్లు పూర్తి అయ్యాయని తెలిపారు. అదే విధంగా గురుబట్లగూడెం యర్రగుంటపల్లి రోడ్లు వేస్తున్నారని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద డ్రైనేజీలకు శివపురం ఎంపిక చేసినట్లు తెలిపారు. నేపాల్‌లో ఉన్న ఆంధ్ర వారిని ప్రత్యేక విమానం ద్వారా ఆంధ్ర కీ తీసుకువచ్చిన ఘనత విద్య శాఖ మంత్రి నారా లోకేష్ చెందుతుందని అన్నారు. చింతలపూడి నియోజక వర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి,దాసరి శ్యామ్ చంద్ర శేషు ,మాజీ జెడ్ పీ టి సి తాళ్లూరి రాధారాణి, చింతలపూడి పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు,జనసేనపార్టీ చింతలపూడి మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపు నాయకుడు చంద్రబాబు : ఎంపీ

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : రాష్ట్ర అభివృద్ధికి ముందుచూపుతో నడుస్తున్న చంద్రబాబు నాయుడు వంటి నాయకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎం కావడం అదృష్టమని ఏలూరు ఎంపీ పొట్ట మహేష్ కుమార్ కొనియాడారు. చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శిక్షణ తీసుకుని ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 36 మంది అభ్యర్థులకు అభినందన కార్యక్రమం శనివారం ఏలూరు సీఆర్ రెడ్డి డిగ్రీ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ చింతమనేని ఏర్పాటు చేసిన ఈ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది నిరుద్యోగులు శిక్షణ తీసుకుని తమ కలలు నెరవేర్చుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా 36 మంది యువతీ యువకులు టీచర్లుగా ఎంపికకావడం చాలా గొప్ప విషయమన్నారు. ఇటువంటి గొప్ప కార్యక్రమం చేస్తున్న ప్రభాకర్ కి అభినందనలు తెలియ చేస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ అన్న మాట నిలబెట్టుకుంటూ మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. మరో 20 ఏళ్ళు టీడీపీ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటే రాష్ట్రం దేశంలోనే నెంబర్ 1గా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణయ్య, జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివ కిషోర్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు మెగా డీఎస్సీ అభ్యర్థులు ప్రజలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి వర్ధంతి

విశాలాంధ్ర -భీమవరం: సీతారాం ఏచూరి సిపిఎం పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి, దేశంలోని కార్మిక వర్గానికి విశేష సేవలందించారని సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్ నివాళులర్పించారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ భీమవరం సిపిఎం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారి వ్యవస్థలో విద్య, వైద్యం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, పేదరికం వంటి సమస్యలు పరిష్కారం కావు సోషలిజం ద్వారానే పరిష్కారం అవుతాయని బలంగా నమ్మి ఆవిధంగా కృషి చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. సీతారాం ఏచూరి జీవించిన ఆఖరి క్షణం వరకు ప్రజా ఉద్యమాకు తన జీవితాన్ని అంకితంచేసిన గొప్ప మేధావి అని జె.ఎన్. విగోపాలన్ కొనియాడారు. పార్టీ శ్రేణులు, యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. సీపీఎం జిల్లా సెక్రెటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, పి.వి.ప్రతాప్, కె.నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి లక్షణాలు కలిగి ఉండాలి

విశాలాంధ్ర-వీరవాసరం: విద్యార్థినీ, విద్యార్థులు మంచి లక్షణాలు కలిగి ఉండాలని, దానివల్ల భవిష్యత్తు బాగుంటుందని ఈగల్ సెల్ కానిస్టేబుల్స్ మురళి, నాగేశ్వరావులు సంయుక్తంగా తెలిపారు. మండలంలోని రాయకుదురు హైస్కూల్లో జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకుదూరంగా ఉందాం, విలువైన ప్రాణాన్ని కాపాడుకుందాం అనే అంశంపై ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు బ్రో, మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే లక్షణాలు, అనర్థాలు, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల వచ్చే రోగాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేయడం ద్వారా జరిగే అనర్థాలు, సెల్ ఫోన్ వినియోగంపై నియంత్రణ లేకపోతే జరిగే సైబర్ నేరాలు అమ్మాయిలు ఇన్స్టాగ్రామ్‌లో రీల్స్ చేసి పోస్ట్ చేస్తే వచ్చే వివిధ సమస్యలను అర్థమయ్యేరీతిలో చక్కగా వివరించారు. అనంతరం అంశాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. చక్కని విషయాలను అందరికి అర్థమయ్యేరీతిలో వివరించిన కానిస్టేబుల్స్‌ను ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు, పాఠశాల ఈగల్ సెల్ కన్వీనర్స్ పి.గజేంద్ర గట్కర్, సిహెచ్.కిరణ్ కుమార్, సాకా వర ప్రసాద్ ఉపాధ్యాయులు కాయల వీరస్వామి, కెవిడి.ప్రసాద్, ఆర్. తులసీ ప్రదీప్, వి.శ్రీనివాసరాజు, వి.నాగ కుమార్ తదితరులు అభినందించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం గ్రామ శివారున శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆర్యపురం, కృష్ణనగర్‌కు చెందిన నల్లమట్టి రాంబాబు (58) సం. రాజమండ్రి నుండి కొయ్యలగూడెం తన సొంత పనుల మీద వచ్చి తిరిగి వెళుతుండగా, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం బుచ్చంపేట గ్రామానికి చెందిన తామ శ్రీరామ్ అతని తల్లితో మితిమీరిన వేగంగా తన ద్విచక్ర వాహనాన్ని నడుపుకుంటూ రాజమండ్రి వెళుతున్న రాంబాబును ఎదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందనీ, తామ శ్రీరామ్‌ను అతని తల్లిని కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని , ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఆటో కార్మికులకు అండగా నిలుస్తా: జ్యోతుల

విశాలాంధ్ర -గోకవరం : జగ్గంపేట నియోజకవర్గం లోని ప్రతి ఆటో కార్మిక సోదరుడికి అండగా నిలుస్తా నని జగ్గంపేట శాసనసభ్యులు టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆటో కార్మికులందరికీ ఉమ్మడి ఇన్సూరెన్స్ చేయిస్తానన్న కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలో ఆటో కార్మికులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు రోజువారీ ఆదాయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా సరే సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు.వారి కష్టాలను దృష్టిలో ఉంచుకొని, మానవతా దృక్పథంతో తన ఫౌండేషన్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. గోకవరం మండలంలో సుమారు 500 మందికి, ఇతర మండలాలతో కలిపి మొత్తం 1700 మందికి పైగా కార్మికులకు బియ్యం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కేవలం బియ్యం పంపిణీకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ఆటో కార్మికులందరికీ ఫౌండేషన్ తరఫున గ్రూప్ ఇన్సూరెన్స్ చేయిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, అర్హులైన సుమారు 2000 మంది నిరుపేద ఆటో కార్మికులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చే కార్యక్రమాన్ని కూడా చేపడతామని ఆయన ప్రకటించారు. ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ కడప భరత్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, గోకవరం మండల పిల్లా చంటిబాబు, జగ్గంపేట మండల కన్వీనర్ జీను మణిబాబు, గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు ,మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి మండల స్థాయి టిడిపి నాయకులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి నరసింహ స్వామి పవిత్రోత్సవంలో 'బత్తుల'

విశాలాంధ్ర - కోరుకొండ : రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కోరుకొండలో లోక కల్యాణార్థం స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారికి పవిత్రోత్సవములు ఈ నెల 10వ తారీకు నుండి ద్రవిడ ప్రబంధన, వేద పారాయణ, శ్రీ వైఖానస ఆగమపండితులు శ్రీమాన్ శ్రీ పాణింగిపల్లి సత్యపవన్ కుమారాచార్యులు వారి బ్రహ్మత్వములో, శ్రీ స్వామి వారి వంశపారంపర్య అర్చకస్వాములు శ్రీ పెదపాటి, శ్రీ పెద్దింటి, శ్రీ పెరవలి వారి స్వీయ పర్యవేక్షణలో, అనువంశిక ధర్మకర్త గారైన శ్రీమాన్ శ్రీపరాశర రంగరాజ భట్టర్ వారు, కార్య నిర్వాహణాధికారి వీర్ల సుబ్బారావు నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వ హించారు. నేడు ముగింపు ఉత్సవంలో భాగంగా ఉదయం నుండి అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు.. ఈ వేడుకలకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి "బత్తుల వెంకటలక్ష్మి" స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాటికొండ బుజ్జి, గ్రామ సర్పంచ్ కరి లక్ష్మి సరోజ వీర గణేష్ కామిశెట్టి దొరబాబు జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక డ్రోన్ స్ప్రేయింగ్‌తో అధిక మేలు

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ద్వారా రైతులకు అగ్నిస్త్రం. వేప పిండి. వేపబెల్లంద్రావణం పాల ఇంగువ. దశపర్ణి కషాయం రైతులకు డ్రోన్ ద్వారా పిచికారి చేయించటం జరుగుతుంది. ఈసందర్భంగా డివిజన్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలుచేసే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొస్తూ ముఖ్యంగా డ్రోన్ ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఫలితాలను సాధించాలని, లక్ష్యంతో క్రిమిసంహారక మందులు తగ్గిస్తూ సేంద్రీయ వ్యవసాయ పద్దతులు అవలంబిస్తూ కషాయాలను తమ వ్యవసాయంలో వినియోగిస్తూరైతులకుఅధిక దిగుబడులు సంపాదించే విధంగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. శనివారం దేవరపల్లి విలేజ్‌లో జ్యేష్ఠ రమేష్ జ్యేష్ఠ శ్రీనివాస్. దేవినా వెంకట రామారావు . దేవినా రాజేష్ వరిచేల్లో 10ఎకాల్లో పురుగుల నివారణకు స్ప్రే చేయించారు. దీని ద్వారారైతులకు తక్కువఖర్చు, ఆదాయంతో పాటుసమయం కూడా వృధా అవ్వ కుండా కేవలం ఎకరానికి ఐదు నిమిషాల్లో డ్రోన్ స్ప్రేయింగ్ తో రైతులకు మేలు జరుగుతుందని, ఒక్కరూతమవ్యవసాయ క్షేత్రాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని శ్రీనివాస్ రైతులకు కోరారు.

పనితీరు మెరుగుపరచుకోవాలి

డీఎస్పీ దేవకుమార్

విశాలాంధ్ర - తాళ్లపూడి : కొవ్వూరు డివిజన్‌లోని తాళ్లపూడి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు సంతృప్తి కారం గానే ఉంది, కానీ మరి కొంత మార్పు చేసుకోవాలని సూచించి నట్లు కొవ్వూరు డిఎస్పీ దేవ కుమార్ తెలిపారు. అలాగే కేసులు (నేరాల) సంఖ్య తగ్గిందని తెలిపారు. ఆయన శనివారం తాళ్లపూడి స్టేషన్ ఇన్స్పెక్షన్‌కి విచ్చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, తాళ్లపూడి మెయిన్‌రోడ్‌లో ట్రాఫిక్ సమస్య మీద దృష్టి పెట్టామని, ఆర్డీఓ తదితర అధికారులతో చర్చించి ఆక్రమణల తొలగింపు చేపడతామని అన్నారు. మెయిన్‌రోడ్‌లోని ఓ మద్యం దుకాణం దగ్గర ట్రాఫిక్ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్న విషయం పై ఎక్సైజ్ శాఖ కూడా ఉంది, పరిశీలించుతామన్నారు. కాగా నేరాల అదుపు కోసం వినియోగపడే సీసీ కెమెరాల ఏర్పాటు, పోలీస్ స్టేషన్ కి ప్రత్యేక డ్రోన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్టేషన్‌కి విచ్చేసిన డిఎస్పీకి ఎస్సై రామకృష్ణ, ట్రైనీ ఎస్సై ఆదిత్య సిబ్బంది ఆహ్వానం పలికారు.

గేదెల మరణాల పై ఉన్నతాధికారుల పరిశీలన

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో గేదెల వరుస మరణాలు పై విచారణ చేసేందుకు పశు సంవర్ధక శాఖ వున్నతాధికారుల బృందం పెద్దేవం విచ్చేసారు. అంతుబట్టని వ్యాధి మిస్టరీ గురించి అనేక పరిశీలనలు జరిపి విషాహారం తినటం వల్ల, కలుషిత నీరు తాగటం వల్లనే అనే నిర్ణయానికి వచ్చారు. రోగం భారినపడ్డ గేదెలు కు అత్యవసరంగా వాడాల్సిన మందులు, జాగ్రత్తలు గురించి క్రింది సిబ్బందికి సూచనలు చేశారు. రాష్ట్రంలో మరెక్కడా ఇటువంటి వ్యాధి గుర్తించలేదని పశు సంవర్ధక శాఖ డి.డి. వై. కృష్ణ జ్యోతి, మరో అధికారి టి. మోహనాంభ పేర్కొన్నారు. గ్రామంలోని కలుషితమైన సుఖుంది చెరువు చుట్టుపక్కల జీవించే గేదెలు, ఆ నీరు తాగే గేదెలకే అనారోగ్యం కలుగుతోందని, రైతులు చెప్పగా, ఆ నీటిని పరీక్షలకు పంపారు. ఉన్నతాధికారులు తాజాగా అవి తినే గడ్డిలో విషతుల్యమైన మొక్కలు ఉండి ఉండవచ్చని మరో అనుమానాన్ని వెల్లడించారు. డా.రాజేంద్రప్రసాద్, డా.ఎస్.వసుంధర, ఎం. అనిత దేవి, డా.వి.వెంకటరెడ్డి తదితరులు అనారోగ్యంగా ఉన్న గేదెలను పరిశీలించారు.

గ్రీవెన్స్‌డేలో ఎమ్మెల్యే ముప్పిడికి వినతి పత్రాలు

విశాలాంధ్ర - కొవ్వూరు : టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. వివిధ సమస్యలపై మండలాల ప్రజలు ఎమ్మెల్యేకి వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి వచ్చిన పలు అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి త్వర తగతన కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 10 వినతి పత్రాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో దిసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సురపనేని చిన్ని కూటమి నాయకులు పాల్గొన్నారు.

22 నుంచి అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాజమహేంద్రవరంలోని ప్రముఖ దేవీచౌక్ ప్రాం గణంలో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి బాల త్రిపుర సుందరీ దేవి శరన్నవరాత్రి మహోత్స వాలను ప్రారంభిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల రాజారాజేశ్వరరావు వెల్లడించారు. శనివారం ఉదయం స్థానిక శ్రీదేవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సంవత్సరం అమ్మవారి ఉత్సవాలను మరింత శోభాయమానంగా, ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఈనెల 21వ తేదీ ఆదివారం రాత్రి 9.45 గంటలకు శ్రీదేవి విగ్రహ ప్రతిష్టను, అలాగే 22వ తేదీ సోమవారం ఉదయం 6.18 గంటలకు కలశ స్థాపన చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలను సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్స వాలలో భాగంగా అనేక సాంస్కృతిక కార్యక్ర మాలు, పౌరాణిక నాటకాలు, సినీ సంగీత విభా వరిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు 28వ తేదీ ఆదివారం 108 దంపతుల పూజ నాదు ఉపాధ్యక్షుడు భైరవస్వామి దంపతుల చే అన్నదానం, 29వ తేదీ మూలా నక్షత్రం సర స్వతి పూజ నాదు ఎస్.వి.ఎస్.ఫైనాన్స్ కంపెనీ వారిచే పుస్తకాల పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. అక్టోబర్ 4వ తేదీన అమ్మవారి ఉద్వాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారా ధనతో మొత్తం ఉత్సవ సంరంభం పరి సమాప్తి అవుతుందన్నారు. ప్రత్యేకంగా లైటింగ్, సెట్టిం గ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా మొత్తం 13 రోజుల పాటు పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు సహకరించిన వారందరికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు భైరవస్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో మోటార్ కార్మికుల హామీలు అమలు పరచాలి

విశాలాంధ్ర - నిడదవోలు : ఆటో, మోటార్ వాహన కార్మికులకు ఎన్నికలలో ఇచ్చిన ఐదు హామీలలో వాహన మిత్ర ఒక్క హామీని మాత్రమే ప్రకటించి మిగిలిన వాటిని విస్మరించడం చంద్రబాబుకు తగదని కులనిర్మూలన పోరాట సమితి ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి, రైల్వే ఆటో యూనియన్ సభ్యులు గెడ్డం రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికలకు ముందు ఏడాదికి 15వేలు రూపాయలు వాహనమిత్ర తోపాటు పెనాల్టీల జీవో 21 రద్దు, సంక్షేమ బోర్డు ఏర్పాటు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గింపు వంటి హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం అధికారానికి వచ్చి 16 నెలల కావస్తున్న వాటిని అమలు చేయలేదని ఆ ప్రకటనలో తెలిపారు. అనంతపురం సభలో కేవలం వాహనమిత్రను మాత్రమే దసరాకి ఇస్తానని ప్రకటించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. చంద్రబాబు మాటలకు చేతలకు పొంతన లేకుండా ఉంటున్నాయని ఇందుకు అనేక ఘటనలు రుజువులుగా వున్నాయని ఆ ప్రకటనలో తెలిపారు. స్త్రీ శక్తి ఫ్రీ బస్సు పథకం కారణంగా ఉపాధి కోల్పోయిన ఆటో, మ్యాజిక్ డ్రైవర్లను ఆదుకునేందుకు వాహన మిత్రకు ఇచ్చే సొమ్మును మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వాహన మిత్రను పెంచుతూ ఎలాంటి కొర్రీలు, మినహాయింపులు లేకుండా అర్హులైన ఆటో, టాటా మ్యాజిక్ తదితర వాహనాల డ్రైవర్లు అందరికీ దసరాకు వాహన మిత్రను అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జీవో నెంబర్ 21 రద్దు, ఆటో మోటారు కార్మికులకు సాధికారత బోర్డు ఏర్పాటు, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల తగ్గింపు వంటి ఎన్నికల హామీలు అమలు చేసేంతవరకు తమ పోరాటం ఆగదని గెద్దం రవీంద్రబాబు ఆ ప్రకటనలో హెచ్చరించారు

ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి దుళ్ల గ్రామ సమస్యలు

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం దుళ్ల గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆ గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య తెలిపారు. శుక్రవారం కడియం మండల కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంతో పాటు, గతంలో కూడా పలుమార్లు ఎమ్మెల్యేతో దుళ్ల గ్రామానికి సంబంధించి పలు సమస్యలపై మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీసీ కాలనీలో ఇళ్లమీద నుంచి ఉన్న 11 కెవి విద్యుత్తు లైను తొలగించాలని, అలాగే ఎస్సీ పేటలో అంబేద్కర్ బొమ్మ ఎదురుగా మండల నిధులతో వేసిన డ్రైనేజ్ కి సంబంధించి అవుట్‌లెట్ ఒకవైపు ఉంటే మరో వైపుకు డ్రైనేజ్ కలపడం వల్ల, రోడ్డుమీద నీరు నిలబడి పోతోందని, దీనివలన అపరిశుభ్రత పెరిగిపోయి దోమలు వ్యాప్తి చెందడంతో, ఎస్సీపేట వాసులు పలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నో ఏళ్ల నుంచి ఎర్ర కాలనీ వాసులకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ మధ్య కాలంలో ఆధునిక టెక్నాలజీతో వస్తున్న మ్యాజిక్ డ్రైన్ వేసినట్లయితే సమస్య కొంత పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యేతో చెప్పినట్లు సర్పంచ్ తెలిపారు. సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే గోరంట్ల సానుకూలంగా స్పందించారని, సమస్యలను పరిశీలించి, ఎస్టిమేట్లు తయారు చేయవలసిం దిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ఆక్వా బోర్డు డైరెక్టర్‌కు జనసేన అభినందన

విశాలాంధ్ర - కాట్రేని కోన : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా అభివృద్ధి బోర్డ్ డైరెక్టర్‌గా నియమితులైన విత్తనాల నాగ శ్రీనివాస రావు (బుజ్జి)ను జనసేన పార్టీ నాయకులు కలిసి అభి నందనలు తెలిపారు. శనివారం ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ ఆధ్వర్యంలో జనసేన నాయకులు కాట్రేని కోనలో శ్రీనివాసరావుకు దుస్సాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. జనసేన సీనియర్ నాయకులు నూకల దుర్గబాబు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు మోకా బాల ప్రసాద్, బళ్ళ కుమార్ పాల్గొన్నారు.

అప్పనపల్లి ఈవోగా సత్యనారాయణ రాజు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - మామిడికుదురు : అప్పనపల్లిలోని శ్రీ బాల బాలాజీ స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా(ఈఓ) ముదునూరి సత్యనారాయణ రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఓగా పనిచేసిన ఆయన 94 రోజుల వ్యక్తిగత సెలవు అనంతరం తిరిగి విధుల్లో చేరారు. ఈయన స్థానంలో ఇంత వరకు జిల్లా దేవాదాయ శాఖ అధికారి వి సత్యనారాయణ తాత్కాలిక ఈఓగా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సత్యనారాయణ రాజు స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే వేగుళ్ల

విశాలాంధ్ర - మండపేట : విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో రాణించి దేశానికి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో 49వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభంలో ఎమ్మెల్యే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా అత్యున్నత శిఖరాలు అధిరోహించవచ్చునని, గెలుపు-ఓటములు సహజమని, ఓటమినే గెలుపుకు నాంది చేసుకోవాలని క్రీడాకారులను సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టెన్నికాయిట్ ఆటగాళ్లకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొద్దిసేపు టెన్నికాయిట్ ఆడి అందరినీ అలరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర - కరప : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసిన కూలీలకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా కాల యాపన జరగడంతో కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వేతనాలు తక్షణమే చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు కే శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఉపాధి కూలీలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయం పక్కన సమావేశం ఏర్పాటు చేసి కూలీలు శతక బాధలు తెలుసుకున్నారు.

రామకృష్ణ మృతి తీరనిలోటు

వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ : గిరిబాబు

విశాలాంధ్ర - రౌతులపూడి : మండలం ములగపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అంకం రెడ్డి సతీష్ సోదరుడు రామకృష్ణ మృతి తీరనిలోటని నియోజకవర్గ వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ములగపూడిలో మృతి చెం దిన రామకృష్ణ భౌతికాయాన్ని సందర్శించి గిరిబాబు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీల్, గొల్లు దివాణం, వాసిరెడ్డి భాస్కర్ బాబు, గొల్లు వెంకటరమణ, సోమరౌతు తిరుమల వెంకన్న దొర, కేదారి శెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు అభినందనలు

శెట్టిబలిజ కులం సర్టిఫికెట్లు జీవో జారీ పట్ల హర్షం

విశాలాంధ్ర - కాట్రేనికోన : శెట్టిబలిజ కులస్తులకు శెట్టిబలిజ బీసీ బి సీరియల్ నెంబర్-4గా కులం సర్టిఫికెట్లు యధావిధిగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 6ను జారీ చేయడం పట్ల ఆ సామాజిక వర్గం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీ సీనియర్ నాయ కులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుత్తుల వెంకట సాయి అధ్యక్షతన నాయకులు కాట్రేనికోనలో సమావేశమై జీవో జారీకి కృషి చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుత్తుల సాయి మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి శుభాష్ సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి వెంటనే తీసుకువెళ్లి గౌడ్ తొలగించి శెట్టి బలిజ కులం సర్టిఫికెట్లు ఇప్పించేందుకు విశేష కృషి చేసి జాతికి ఎంతో ఉపకారం చేశారని కొనియాడారు. అన్నదమ్ములుగా ఉండే బీసీ కులాల మధ్య మన స్పర్ధలు వచ్చేలా వైసీపీ పాలనలోనే గౌడ్ (శెట్టి బలిజ) కులం సర్టిఫికెట్లుగా మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారని సాయి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో పదవులను ఏలుతున్న శెట్టిబలిజ నాయకులు ఎవరూ పట్టించుకోలేదని, మంత్రి సుభాష్ చిత్త శుద్ధితో కృషి చేసి సీఎం ద్వారా పాత జీవోలో మార్పులు చేసి బీసీలకు చెందిన గీత కులాలకు న్యాయం చేశారన్నారు. మంత్రి సుభాష్ కులం కోసం మాత్రమే నిస్వార్థంగా పనిచేసి చిరస్థాయిగా పేరు తెచ్చుకున్నారని గుత్తుల అభినం దించారు. మంత్రి సుభాష్‌ను అభినందించి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశం తీర్మానిం చింది. శెట్టి బలిజ నాయ కులు శీలం సూర్యనా రాయణ, విత్తనాల వెంకట రమణ, వెంకట సత్య నారాయణ, వనచర్ల నాగేశ్వరరావు, విత్తనాల బుజ్జి, వాసంశెట్టి రాజేశ్వరరావు, కముజు సర్వే శ్వర రావు, గౌవ్వాల సత్తిబాబు, శీలం ప్రసాద్, కొప్పిశెట్టి ఏడుకొండలు ఈసమావేశంలో పాల్గొన్నారు.

యువతకు సాయికిరణ్ స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - రాజోలు : తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా మెగా మెడికల్ క్యాంప్ పెట్టాలన్న ఆలోచన యువతకు స్ఫూర్తిదాయకమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు మండలం శివకోటి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శివకోటి గ్రామానికి చెందిన శెట్టిబలిజ యువత అధ్యక్షుడు దొంగ సాయి కిరణ్ కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా వినుత్నంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే వంప్రసాద్ మెడికల్ క్యాంప్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసు కుంటున్నారని అలా కాకుండా తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా ఎలాంటి ఆర్భాటాలకు పోకుండా సేవా దృక్పదంతో మెడికల్ క్యాంపు నిర్వహించిన సాయి కిరణ్‌ను అభినందించారు. సాయికిరణ్‌ను అంతా అదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నక్కా రామారావు, డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనువాస్, ఎంపిపి దుర్గ, ఎంపిటిసి ఉండ్రు సూర్యరావు, కసుకుర్తి త్రీనాథ్ స్వామి, జనసేన నాయకులు దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, మంగెన భూదేవి నానీ, ఉండ్రు అనిల్ పలువురు పాల్గొన్నారు.

కోరమండల్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్ట్ కార్యా లయంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షురాలు గౌరీ మాట్లాడుతూ సమాజ హితం కోసం పనిచేయడం కర్తవ్యంగా భావించి తమ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వ ర్యంలో ప్రతినెల ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు సరుకులు అందజేస్తున్నామన్నారు. ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ ప్రతినిధి జీ కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ సేవ మాధవ సేవ అనే సద్భావంతో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు సేవా కార్యక్రమంలో పాల్గొనడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యురాలు మోహిని కుమారి, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, శ్రీవాణి, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

కాకినాడ ఐడిఏ ఆధ్వర్యంలో ప్రపంచ డెంటల్ ఫ్రీ డే

విశాలాంధ్ర - కాకినాడ : డెంటల్ ఫ్రీ డే అనేది దంతవైద్యులు సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఉచిత దంత సంరక్షణను అందించే రోజు అని అడబాల రత్న ప్రసాద్ అన్నారు. ఇది ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 13న జరుగు తుం దని, ఈ రోజున మా అడబాల ట్రస్ట్ లోనీ మహి ళలు అందరికీ కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల సత్యనారాయణ ఉచిత సేవలను అం దించారని అన్నారు. డా అడ్డాల సమా జానికి సేవ చేయడానికి, ఉచిత దంత సంరక్ష ణను అందించడానికి ఎల్లప్పుడూ ముందుం టారని అన్నారు. డా అడ్డాల మాట్లాడుతూ "ఆరోగ్యకరమైన దంతాల కోసం, రోజుకు రెండుసార్లు ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్‌తో పళ్ళు తోముకోవాలని, క్రమం తప్పకుండా దంతవైద్యుని వద్దకు వెళ్లాలని అన్నారు. పళ్ళ మధ్య ఇరుక్కున్న ఆహార కణాలను, తొలగించడానికి ప్రతిరోజూ ఫ్లాస్ లేదా ఇంటర్‌డెంటల్ బ్రష్‌ను ఉపయోగించాలని. చక్కెర, తీపి పానీయాలు ఎక్కువగా తీసుకోవడం తగ్గించాలని, ఎందు కంటే ఇవి దంతక్షయానికి దారి తీస్తాయని. దంతవైద్యుడి వద్దకు క్రమం తప్పకుండా వెళ్ళాలని మీ టూత్ బ్రష్‌ను ప్రతి 3-4 నెలలకు ఒకసారి మార్చాలని తెలిపారు.

తీర ప్రాంతాన్ని పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : యు కొత్తపల్లి మండలం ఉప్పాడ సముద్ర తీర ప్రాంతంలో అసిస్టెంట్ కలెక్టర్ మనీషా శనివారం మధ్యాహ్నం పర్యటించారు. అలల తాకిడి ఎక్కువగా ఉన్న కొత్తపట్నం సమీపంలో ఆమె పర్యటించి మండల స్థాయి అధికారులను ఏఏ ప్రాంతాల్లో కోత గురవుతుంది మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తపట్నం సమీపంలో ఉన్న పాఠశాలను ఆమె పరిశీలించారు. ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్‌లో ధ్వంసం అయిన బీచ్ రోడ్డు పరిశీలించి గ్రామంలో ఉన్న ప్రజలను, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాల్లో కరెంటు లేక చాలా ఇబ్బందులు గురవుతున్నామని, రాత్రి సమయంలో బిక్కుబిక్కుమంటూ ఉంటున్నామని అన్నారు. తక్షణమే విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా అలల తాకిడి కారణంగా కొత్తపట్నం వాసులకు రేషన్ అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. జాయింట్ కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, యు కొత్తపల్లి తాసిల్దార్ చిన్నారావు, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

శెట్టిబలిజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

విశాలాంధ్ర - రాజోలు : శెట్టిబలిజ కులస్తులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. ఆయన పొన్నం మండలంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవరిస్తూ కుల ధృవపత్రంలో శెట్టిబలిజ కులం వచ్చేలా కొత్త జీవోను తీసుకురావడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. గత నెల రోజులుగా మంత్రి వాసంశెట్టి సుభాష్ అలుపెరుగని పోరాటం చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కి వాస్తవాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్‌కి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

హోంగార్డ్స్ డీఎస్పీగా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : డీఎస్పి (హెూంగార్డ్స్)గా పి. కిరణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్ కు చెందిన ఆయన సాధారణ బదిలీలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు డి.ఎస్.పి (హెూంగార్డ్స్)గా బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతల అనం తరం ఆయన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు లక్ష్మీ దుర్గ

విశాలాంధ్ర - పెదపూడి : కాకినాడలో జరిగిన జూనియర్ అండర్ 20 బాలికల విభాగం సెలక్షన్స్‌లో పెదపూడి గాంధీ మెమోరియల్ గవర్నమెంటు హైస్కూల్‌కి చెందిన విద్యార్థిని జీలం లక్ష్మీదుర్గ ఎంపికయిందని, సెప్టెంబర్ 24 నుంచి 27 వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో లక్ష్మీ దుర్గ పాల్గొంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారిణి లక్ష్మీదుర్గ, పాఠశాల పిడి మురళి కుమార్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పదరీతిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర – సీతానగరం : భార్య భర్తల మధ్య కొంతకాలంగా జరుగుతున్న గొడవలు నేపథ్యంలో వియ్యపు వెంకటేష్ (34) అనే వ్యక్తి అనుమానాస్పద రీతిలో తనువు చాలించాడు. మండలంలోని సీతానగరం గ్రామంలో స్థానిక మావుళ్ళమ్మ ఆలయం సమీపంలో ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఫ్యాన్ కి ఉరి వేసుకొని మృతి చెందాడు. ఇందుకు సంబంధించి సీతానగరం పోలీసు స్టేషన్లో శనివారం కేసు నమోదు అయ్యింది.ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని కాతేరు గ్రామానికి చెందిన వియ్యపు వెంకటేష్ అలాగే మండలకేంద్రమైన సీతానగరం గ్రామానికి చెందిన సత్యవేణితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది.కొంతకాలంగా భార్య భర్తలు మధ్య గొడవలు జరుగుతున్నాయి. మృతుడు వెంకటేష్ అత్తమామల ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకున్నట్లు చెప్పారు.ఈ నెల 12వ తేదీ రాత్రి వెంకటేష్ తన బావమరిదితో చాలా సమయం వరకూ మద్యం సేవించి సీతానగరం గ్రామంలో ఉన్న అత్తవారింటికి వెళ్ళారని, ఆ సమయంలో ఇంటి వద్ద ఎవ్వరులేరన్నారు. శనివారం ఉదయం 7 గంటలకు భార్య, ఇంటి సభ్యులు వచ్చి చూడగా సీలింగ్ ప్యాన్ కు ఉరి వేసుకుని ఉన్నాడన్నారు. దీంతో స్థానికులు సహాయంతో క్రిందకు దించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు వెంకటేష్ సోదరుడు రామ దుర్గా ప్రసాద్ తన సోదరుడు మృతి పై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చెయ్యడంతో అనుమానస్పద మృతి క్రింద కేసు నమోదు చేయమన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.మృతుడు వెంకటేష్కి భార్య, పాప, బాబు ఉన్నారు. దీంతో అతని కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వైసీపీ నుంచి టిడిపిలోకి పలువురు ముస్లింలు

విశాలాంధ్ర - గోకవరం : గోకవరంలోని పలువురు ముస్లింలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ నాయకత్వాన్ని బలపరుస్తూ తెలుగుదేశం పార్టీలో చేరారు. కృష్ణుని పాలెం గోపికృష్ణ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీలో చేరిన ముస్లింలకు టిడిపి కండువాలతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజల తిరస్కారంతో ప్రతిపక్ష హోదా కూడా లేని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి ప్రజా రంజికపాలనందిస్తున్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో సూపర్ హిట్ అని ప్రజలతో అనిపించుకున్న తెలుగుదేశం పార్టీలోకి పలువురు ఆకర్షితులవుతున్నారని అందులో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలో అనేకమంది టిడిపిలో చేరడమే దీనికి నిదర్శమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, మాజీ జెడ్పిటిసి సభ్యులు పాలూరి బోసు బాబు, సీనియర్ టిడిపి నాయకులు పోసిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ను కలిసిన ఆర్డీవో

విశాలాంధ్ర- కొవ్వూరు : తూర్పుగోదావరి జిల్లా నూతన కలెక్టర్గా కీర్తి చేకూరి శనివారం కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

పోతుల మోహనరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సింగరం పాలెం గ్రామంలో గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమించిన సందర్భంగా గండేపల్లి గ్రామ వెలమ సంఘం మోహనరావును ఘనంగా సన్మానించి, మెమొంటో అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గండేపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కంటిపూడి సత్యనారాయణ, గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, గండేపల్లి గ్రామ తెలుగుదేశం నాయకులు, గండేపల్లి గ్రామ వెలమ సంఘం పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారం కోసమే ఐద్వా

విశాలాంధ్ర - అమలాపురం : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం డివిజన్ ముఖ్య బాధ్యుల సమావేశం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ ఆర్ సుశీల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఐద్వా జిల్లా బాధ్యురాలు డి ఆదిలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం(ఐద్వా) అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. మహిళలపై వేధింపులు గృహహింస విద్యా ర్థునులపై వేధంపు లాంటి సమ స్యలతో నేటి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటి పరిష్కారానికి స్త్రీ సమా నత్వం మహిళలపై అత్యా చారాలు వేధింపులు అరి కట్టాలని స్థానిక సంస్థల పరిష్కారం చేయాలని ఐద్వా అనేక సంవత్సరాలుగా పోరాడుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి యువత మత్తు పదార్థాలు, గంజాయి, మద్యం లాంటి వాటికి బాని సలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటిపై అవగాహన కార్యక్రమాలు ఐద్వా నిరంతర నిర్వహిస్తుందని వారు తెలిపారు. మహిళలపై వేధింపులతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్కీంవర్కర్లు, శ్రామిక మహిళా సమస్యలపై కూడా ఐద్వా కృషిని కొనసాగించాలని సందర్భంగా పిలుపు నిచ్చారు. జిల్లాలో ఐద్వా మహిళా సంఘం అభివృద్ధి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సంగ సభ్యత్వం, స్థానిక కమిటీలు నిర్మాణం, స్థానిక సమస్యలపై కృషిని కొనసాగించాలని అనంతరం జిల్లా మహాసభలు నిర్వహించాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జి దైవ కృప, కే బేబీగంగ రత్నం, బి ఎస్తేరు రాణి, సుబ్బలక్ష్మి, పి అమూల్య, హైమావతి, ఉమా సత్యవాణి, మణిమాల, మరియమ్మ, తులసి, గౌరీ, విజయలక్ష్మి, పూర్ణిమా పాల్గొన్నారు.

అప్పీల్ లేని అంతిమ తీర్పు

విశాలాంధ్ర - పిఠాపురం : జాతీయ లోక్ అదాలత్లో భాగంగా స్థానిక కోర్ట్ హాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీహరి మాట్లాడుతూ కక్ష దారులు ఒక్కొక్కరు అవగాహన చేసుకుని రాజీమార్గం ద్వారా అపీల్ లేని అంతిమ తీర్పు ఈ లోక్ అధాలత్ ద్వారా పొంద వచ్చు అన్నారు. ఈసందర్భంగా రాజీమార్గంలో 122 కేసుల పరిష్కారమయ్యాయి.

సిర్రా వారి పేటలో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

విశాలాంధ్ర - మామిడికుదురు : మండల పరిధిలోని పాసర్లపూడి గ్రామంలోని సిర్రా వారి పేటలో ఓల్టేజ్ సమస్యకి పరిష్కారం చేశామని మామిడికుదురు మండల విద్యుత్ శాఖ ఇంచార్జి అసిస్టెంట్ ఇంజినీర్ వై వేంకటేశ్వర రావు తెలిపారు. దీర్ఘకాలంగా ఆ ప్రాంత వాసు లలో ఓల్టేజ్ సమస్యతో సతమతం అవుతున్నారనీ వారి ఇబ్బందులు దృష్ట్యా 16కేవీ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తమ ప్రాంతానికి విద్యుత్ సమస్య తీరడంతో ప్రభుత్వానికి, విద్యుత్ శాఖ అధికారులకు ఆ ప్రాంత వాసులు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, సిర్రా జగ్గారావు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం స్వార్ధ పాలన సాగిస్తుందని మండలంలోని వేదిరేశ్వరం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సరిపెల్ల శ్రీనివాస రాజు అన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశం మేరకు మండల పరిధిలో వేదిరేశ్వరం గ్రామపంచా యతీలో గల మూలగూడెం గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డ్ల పంపిణీ జరిగింది. మూలగూడెం గ్రామం రేషన్ షాప్ వద్ద జరిగిన రేషన్ షాప్ నెంబర్ 5 డీలర్ కుడుపూడి వెంకటరమణ రేషన్ షాప్లో స్మార్ట్ కార్డుల పంపిణీలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1.46 కోట్ల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో క్యూ ఆర్ కోడ్తో రేషన్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చేసిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని, ఒక్క కొత్తపేట నియోజకవర్గంలోనే 92,151 మందికి ఈ స్మార్ట్ కార్డులు అంది స్తున్నట్లు తెలిపారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సరిపెల్ల శ్రీనివాస రాజు, నడింపల్లి సూరిబాబు, కర్రీ వెంకట రామకృష్ణారెడ్డి, కోసూరి సుబ్బ రాజు, సాధన శ్రీను, బొక్కా నరసింహమూర్తి, కొప్పిశెట్టి ప్రసాద్, దొడ్డిపట్ల నాగ చంద్ర, రాయుడు సత్యనారాయణ, గుత్తుల వీర రాఘవులు, కొప్పిశెట్టి గోవిందు, కుడుపూడి ఏడుకొండలు, మట్టపర్తి చంద్రరావు, మట్టపర్తి సత్యనారాయణ, చిట్టూరి శ్రీను (ఎంపీటీసీ), కుడిపూడి పార్వతి (మాజీ జన్మభూమి కమిటీ మెంబర్), కొప్పు శెట్టి నాగలక్ష్మి, ఇలా ప్రభావతి, కుడిపూడి విజయలక్ష్మి, ఇల్లా సుబ్బలక్ష్మి తదితరులు తెలుగు దేశం మహిళ కార్యకర్తలు రేషన్ డిపోల ద్వారా వద్ద జరిగిన స్మార్ట్ కార్డుల పంపిణీలో కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళకళలాడిన వాడపల్లి దివ్య క్షేత్రం

– గోవింద నామస్మరణతో మారుమ్రోగిన ఆలయ ప్రాంగణం

విశాలాంధ్ర – ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటే శ్వర స్వామివారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉద యం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ డిప్యూటీ కమి షనర్ నల్లం చక్రధర్ రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. శనివారం స్వామివారి ఆదాయం రూ.71, 81,628 లు సాయంత్రం ఐదు గంటల వరకు వచ్చిన ఆదాయం. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరైంట్ రాంబాబు వర్మ, రాపాక శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సిఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్ రాము తన సిబ్బందితో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

గోదావరిలో దూకిన వ్యక్తిని కాపాడిన వైనం

విశాలాంధ్ర - కాకినాడ, ఆత్రేయపురం : ఆత్రేయపురం మండలం, లొల్ల గ్రామంలో కొత్త కాలనీకి చెందిన కుంపట్ల సత్యనారాయణ వెంకన్న వయసు 65 సంవత్సరాలు కుల ము కాపు అను ఆసామి జొన్నాడ బ్రిడ్జ్ 15వ పిల్లర్ వద్ద నుండి చనిపోవాలని గోదావరిలోకి దూకు తుండగా అటుగా రాజమండ్రి వైపు వెళ్తున్న 2023 బ్యాచ్కి చెందిన ప్రొబేషనరీ ఉమెన్ డిఎస్పి అయినా జా ప్రదీప్తి చూసి వెంటనే ఆలమూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి నరేష్కి ఫోన్ చేయగా అంతట ఎస్ఐ అక్కడే దగ్గర్లో విధులు నిర్వహిస్తున్న స్టేషన్ కానిస్టేబుల్ అయిన పలివెల రాజు, జొన్నాడ హైవే మొబైల్ హెూంగార్డ్ అయిన సాయితో దగ్గర్లో చేపలు వేటాడుతున్న జాలర్లు జొన్నాడకు చెందిన జక్కాల సూరిబాబు బూరి, కోమల దుర్గ ప్రసాద్ సహాయంతో పడవపై వెళ్లి గోదావరిలో కొట్టుకుపోతున్న సదరు కొంపట్ల సత్యనారాయణను కాపాడి ప్రథమ చికిత్స నిమిత్తం ఆలమూరు గవర్నమెంట్ ఆసుపత్రికు ప్రొబెషనరీ డీఎస్పీ ప్రదీప్తి దగ్గర ఉండి ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. అక్కడ నుండి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసినారు. ప్రసుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్ తెలియజేసినారు. ఇంత త్వరగా స్పందించి ఒక మనిషి ప్రాణాలు కాపడినందుకు జిల్లా ఎస్పీ దీ కృష్ణారావు, ఇబ్రా మురళీ మోహన్, సీఐ విద్యాసాగర్, ప్రొబేసనరీ డీఎస్పీ ప్రదీప్తి, ఆలమూరు ఎస్ఐ నరేష్. రాజు సాయి. జాలర్లు సూరిబాబు, దురాగ్గప్రసాద్లను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

బాలకృష్ణను పరామర్శించిన ముద్రగడ గిరి బాబు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : పెద్దాపురం మండలం దివిలి గ్రామానికి చెం దిన ముద్రగడ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు కాంట్రాక్టర్ కొత్తెం బాల కృష్ణ తండ్రి శ్రీరామ్మూర్తి ఇటీవల కాలంలో మరణించడంతో వారి కుటుం బాన్ని ప్రత్తిపాడు నియోజక వర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరా మర్శించి శ్రీరామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిబాబు మాట్లాడుతూ బాలకృష్ణ కుటుంబానికి మా కుటుంబానికి దశాబ్దాల కాలం నుండి అనుబంధం మరవలేనిది అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

విశాలాంధ్ర - భీమవరం : జిల్లాలో పెండింగ్ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయటానికి ప్రాధాన్యత ఇస్తున్నానని, తాను ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ ప్రాధాన్యత వారీగా నెరవేరుస్తున్నానని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శనివారం భీమవరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిలి రైల్వే స్టేషన్లో రెండు ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్ట్ తీసుకువచ్చానని నరసాపురం - చెన్నై వందే భారత్ తీసుకువచ్చానని గుడివాడ, భీమవరం హాల్ట్ మంజూరు అయ్యిందని ఆయన గుర్తు చేశారు. తాను వారసత్వం ఆధారంగా రాజకీయాల్లోకి రాలేదని, డబ్బు దోచుకోవటానికి కానీ, వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికి కానీ రాజకీయాల్లోకి రాలేదని, నేను రాజకీయాల్లోకి వచ్చింది, బీజేపీకి రెండే రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నప్పుడని, బీజేపీ సిద్ధాంతాలు నచ్చి, దేశభక్తి తో రాజకీయాలకు వచ్చానని ఆయన పేర్కొన్నారు. అహంకారపూరిత రాజకీయాలకు స్థానం లేదని విద్యార్థి రాజకీయాల్లో డబ్బు, అధికారం ఉన్నవారికి భయపడకుండా ఢీకొన్నానన్నారు. తాను చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎవరైనా హైజాక్ చేస్తే గట్టి సమాధానం చెప్తానని, నేను చేసే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ భవనం నిర్మించాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : గ్రామ సర్పంచ్ ఇచ్చిన హామీ మేరకు కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామంలో పంచాయతీ భవనం నిర్మించాలని ఆ గ్రామ ప్రజలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు వల్ల తమ గ్రామాన్ని 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగన్నగూడెం వెళ్లటం భారంగా ఉందన్నారు. అందువల్ల కుంతలగూడెం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్త పరిచిన విషయం గుర్తు చేశారు. ఆ కారణంగా రెండు గ్రామాలకు కలిపి కనకాద్రిపురం గ్రామంలో భవనం నిర్మించాలని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినట్లు ఎంపీడీఓకి వివరించారు. గ్రామ సభలో కనకాద్రిపురం గ్రామస్తులందరు కలిసి తమ గ్రామంలోనే పంచాయతీ భవనం కట్టాలని డిమాండ్ చేసినా తమకు మెజారిటీ ఉందని గ్రామ సర్పంచ్ కుమారుడు ప్రకాష్ శపథం చేసి 37వ తీర్మానం చేశారన్నారు. అయినా గ్రామ సర్పంచ్ పులి నాగరత్నం హాజరు కాకుండా ఆమె కుమారుడు గెడా సూర్య ప్రకాశరావు సర్పంచ్ హోదాలో ప్రొసీడింగ్స్ నిర్వహించటం చట్ట విరుద్ధమని ఎంపీడీఓకు, గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాస్తవానికి తాము హైకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యు 16541/2020 ఇప్పటికీ పెండింగ్ లో ఉండగా గ్రామ పంచాయితీని కనకాద్రిపురం నుంచి కుంతలగూడెం తరలించటం వల్ల న్యాయ పరమైన ఇబ్బందులు తలెత్తుతాయని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. అందువల్ల తమకు న్యాయం జరపాలని కనకాద్రిపురం ప్రజలు కోరుతున్నారు. తమకు అన్యాయం జరిగితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలగందుల ధర్మరాజు, టెక్కిన తిరుపతయ్య, దుగ్గిరాల పెద్ది రాజు, వెంకటేశ్వరరావు, నలమాటి సత్యభామ, యెల్లిబోయిన లక్ష్మీ, కామాక్షి , నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారం

విశాలాంధ్ర - కొవ్వూరు : రాజీమార్గం ద్వారా పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడంలో లోక్ అదాలత్ వేదికగా నిలుస్తుంది అని 9 అదనపు జిల్లా జడ్జి ఎం అనురాధ అన్నారు రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థల ఆదేశాల మేరకు శనివారం కొవ్వూరు కోర్టు ప్రాం గణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం కోసం 3 బెంచిలను ఏర్పాటు చేసి పెండింగ్ కేసులను పరి ష్కరించారు.రాష్ట్ర , జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తం గా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా మండల న్యాయ సేవ సంస్థ అధ్వర్యం లో శనివారం కోర్ట్ ల ప్రాంగణం లో పెండింగ్ మరియు ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కర నిమిత్తం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు .ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కర నిమిత్తం మొదటి బెంచ్‌కు సంస్థ చైర్మన్ 9 వ అదనపుజిల్లా జడ్జి ఎం .అనురాధ న్యాయవాది సభ్యునిగా వై.చల పతి వ్యవహరించారు .సివిల్ కేసులపరిష్కర నిమిత్తం ఏర్పాటు చేసిన 2వ బెంచ్ కు సీనియర్ సివిల్ జడ్జి జీ.వి.ఎల్ .సరస్వతి .న్యాయవాది సభ్యుని గా ఎం .గోపి .సివిల్, క్రిమినల్ కేసుల నిమిత్తం ఏర్పాటు చేసిన 3వ బెంచ్‌కు కే .నాగ లక్ష్మి .న్యాయ వాది సభ్యుని గా కే .బ్రహ్మా య్య వ్యవహరించారు

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర- కొవ్వూరు: కూటమి ప్రభుత్వం బిల్డింగ్ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సెప్టెంబర్ 15న చలో విజయవాడ లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి జయప్రదం చేయండి. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్‌బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 15న జరుగుతున్న లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తూర్పుగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందర్ బాబు పిలుపు ఇచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్‌బోర్డు నుండి అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను గత వైసీపీ ప్రభుత్వం ఆపేసి భవన నిర్మాణ కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని, గత ఎన్నికలకు ముందు కూటమి నాయకులు వైసీపీ భవన నిర్మాణ కార్మికులకు చేసిన అన్యాయాన్ని సరిచేస్తామని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ నిచ్చారన్నారు. ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరంన్నర పూర్తవుతున్నా నేటికీ సంక్షేమ పథకాలు అమలు చేయలేదని దేశంలోని అన్ని రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు ఆయా రాష్ట్రాల వెల్ఫేర్ బోర్డుల ద్వారా వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 3 వేల కోట్లు నిధులు ఉండి ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయడం లేదని ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం నేటికీ అచరణలో అమలు చేయకుండా నిర్మాణ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మికులందరూ చలో విజయవాడకు తరలిరావాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య జిల్లా గౌరవ అధ్యక్షులు మైగాపుల నాగేశ్వరరావు నాయ కులు మాణిక్ రెడ్డి బాబు ఎం. అప్పారావు ఎం రామకృష్ణ నందం కొండబాబు నాయకత్వంలో పట్టణంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

డీసీసీ బ్యాంకును లాభాల్లోకి తీసుకురావాలి

- మంత్రి మనోహర్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) వల్ల ఎంతోమంది రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ప్రస్తుతం అది నష్టాలు బాటలో ఉందని దానిని లాభాల్లో తీసుకొచ్చేలా కృషి చేయాలని బ్యాంక్ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు)కి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. శనివారం మనోహర్ బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ బ్యాంకు చాలా నష్టాల్లో ఉందని దానిని లాభాల్లో తీసుకొచ్చేందుకు పాలకవర్గం కృషి చేయాలని మనోహర్ సూచించారు. సహకార రంగంలో ఎంతో అనుభవం ఉన్న బాబుకు అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టామని, బ్యాంకుకు లాభాల్లోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని బాబుకు సూచించారు. బ్యాంక్ అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయి సహకారం అందించి లాభాల బాటలో పట్టించేలా కృషి చేస్తానని చెప్పారు. బ్యాంక్ అభివృద్ధికి ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల సహాయ సహకారాలు తీసుకుంటూ బ్యాంకును లాభాల బాటలో తీసుకొచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, జనసేన నాయకులు వేగుళ్ల లీలా కృష్ణ, తుమ్మలపల్లి రమేష్, వరుపుల తమ్మయ్య బాబు, సంగిశెట్టి అశోక్, తలాటం సత్య, మర్రెడ్డి శ్రీనివాస్, చల్లా లక్ష్మీ, బ్యాంక్ డిజిఎం ఎం శ్రీధర్ చౌదరి, బ్యాంకు సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు

- చేతకాని ప్రభుత్వం - అధికారుల బూటకపు ప్రకటనలు
- రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ఆగ్రహం
- ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన

విశాలాంధ్ర - మండపేట : రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు ఆరోపించారు. శనివారం మండపేటలో మీడియాతో మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని చెప్పుకునే కూటమి ప్రభుత్వం చేతకానితనానికి యూరియా కొరత నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు రైతులకు యూరియా దొరకక వేదన పడుతుంటే మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు తగినంత స్టాక్ ఉందని చెప్పడం సిగ్గుచేటన్నారు. గత 15 రోజులుగా అనేక జిల్లాల్లో యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆయన దుమ్మెత్తి పోశారు. భూ విస్తరణ ఆధారంగా కాకుండా కేవలం ఆధార్ కార్డు ఆధారంగా ఒక్కో రైతుకు ఒకే బస్తా యూరియా ఇవ్వడం అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా బస్తాలు బ్లాక్‌లో కొనుగోలు చేసుకోమని ప్రభుత్వం చెప్పకనే చెప్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రం అంతటా పర్యటిస్తున్నప్పుడు రైతులు ఎరువుల కోసం పనులు మానుకుని సొసైటీలు, ఆర్‌బీకేల చుట్టూ తిరుగుతున్నారని, అధిక ధరలకు బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 15వ తేదీ సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ రహదారిలో వాహనదారులకు తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర - సీతానగరం: ఈ రహదారిపై ప్రయాణం అంటేనే వాహనదారులకు తప్పని ఇక్కట్లు. మండలంలో రాపాక నుంచి గంగాలమ్మా మెట్టమీదుగా నల్గొండ కోరుకొండ రహదారి పై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు బెంబేలు. శనివారం రాపాక గ్రామ సరిహద్దుల నుంచి కోనేరు వద్ద నున్న నేరుడు చెట్టు వరకూ బీటీ రోడ్డు పై పెద్ద పెద్ద గోతులు ఏర్ప డడంతో లారీ గోతులు తప్పించబోయి పక్కనే ఉన్న పంట బోదులోకి దూసుకొని వెళ్లడంతో రెండు జేసిబిల సహాయంతో బయటకు తీశారు. లారీ పరిస్థితే ఇలా ఉంటే కార్లు, ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. ఈ గోతులు చాలవు అన్నట్టు సీసీ రోడ్డు ఇరువైపులా ఉపయోగం లేని మొక్కలు పెరిగి రోడ్డు పైకి కొమ్మలు విస్తరించి ద్విచక్ర వాహనదారులకు తగులుతూ రహ దారి అంచులు కనపడడం లేదు. దీనితో వాహనాలు తప్పుకోవడానికి ఇబ్బం దులు పడాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం కోసం శంకు స్థాపన జరిగినా ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో వాహనదారులు అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు పొలాలకు ఎరువులు తీసుకొని వెళ్లాలి అంటేనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున అధికారులు నాయకులు స్పందించి ఈ మొక్కలను తొలగించే ఏర్పాట్లు చేయడంతో పాటు త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి, పూర్తి చేసి ఇక్కట్లు తొలగించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

సీతారాంపురం గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సి. హెచ్.రాణిను విధుల నుండి సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన పి.ప్రశాంతి ఆదేశాల మేరకు సీతారాంపురం గ్రామ సెక్రటరీ రాణి ను సస్పెండ్ చేశారు.ఇందుకు సం బంధించి పత్రిక ప్రకట నను విడుదల చేశారు. దీనిలో భాగంగా సీతారాం పురం సెక్రటరీగా కన్న ముందు రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకట నగరం గ్రామ పంచాయతీ కార్య దర్శి (గ్రేడ్-4)గా విధులు నిర్వర్తిం చారు. ఆసమయంలో జరిగిన అవినీతి, అక్ర మాలకు సంబంధించి, ప్రస్తుతం సీతా రాంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రాణి పై ఎట్టకేలకు సస్పెండ్ వేటు పడింది. వెంకటనగరం గ్రామ పంచాయతీ నిధులలో రూ34, 56,091లు దుర్వినియోగం జరిగినట్లు లభించిన ఆధారాలు, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా ఆమెపై శిక్షణాత్మక చర్యలు ప్రారంభించడానికి నిర్ణయించినట్టు జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. నిధుల దుర్వినియోగం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్, 1991 లోని రూల్ 8(1) ప్రకారం రాణిని విధుల నుండి సస్పెండ్ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారిశాంతామణి తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సి. హెచ్. రాణి ప్రధాన కార్యాలయం సీతారాంపురం గ్రామ పంచాయతీగానే నిర్ణయించి నట్లు, అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయం వదిలి వెళ్లరాదని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కాలంలో ఆమెకు సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించను న్నట్లు తెలిపారు. ఎంపీడీవోకు రాణి సస్పెన్షన్ ఆర్డర్ అందజేసి, ప్రత్యామ్నాయ ఇన్చార్జి నియామకానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.